628) శుద్ధవసంతం

ప॥ అక్షయంబగుమోక్ష మందుటే తగుగాక । భక్షించుపండ్లకు బ్రాణ మీదగునా ॥

చ॥ కొండంతపసిడి కలగూరకె వెలయిడిన । నిండినవివేకులకు నేరమిదిగాదా ।
దండమిది హరి నిన్ను దలచినదలంపులెల్ల । నిండిన పాపము వాపుమనుట కిది దగునా ॥

చ॥ గుఱుతుగలరత్నంబు గుగ్గిళ్ళ గొనగ వెల- । పఱచుటే తన బుద్ధి పాడౌట గాదా ।
అఱిమఱి హరి నిన్నునర్చించుఫలమెల్ల । కఱకుదనదేహభోగములకనదగునా ॥

చ॥ కామధేనువు దెచ్చి కాసుకె వెలకొసగ । కామించి నధికులకు కడుగొరతగాదా ।
శ్రీమంతుడైనట్టి శ్రీవేంకటేశ నిను । సేమమున గొలిచి తుచ్చెము లడుగదగునా ॥